స్వెతస్లావ్ సఖర్నోవ్

సముద్రంమీద ఓడల విహారం



స్వెతస్లావ్ సఖర్నోవ్

సముద్రంమీద ఓడల విహారం

చిత్రాలు:
ఎ. బెన్యమిన్‌సొన్, బి. కిష్టీమొవ్

అనువాదం:
ఆర్వియార్

"రాదుగ" ప్రచురణాలయం · మాస్కో

మొట్టమొదటి నావ కొయ్యదుంగతో తయారైంది. మనిషి ఒక చెట్టు పడగొట్టి, దాని కొమ్మల్ని నరికేశాడు. తర్వాత అతను దాన్ని ఒక దోనెగా చెయ్యడానికి తొలిచాడు. లోపల కూర్చొని నదిమీద వెళ్లాడు. కొంత కాలం తర్వాత, తెడ్లతో నడుపుకుంటూ యెక్కువ దూరం వెళ్లలేమని మనిషి తెలుసుకున్నాడు. అప్పుడు తెరచాపని కనిపెట్టి సముద్రాలమీద ప్రయాణం ఆరంభించాడు.



కోచ్

కోచ్ అనే ఒక చిన్న ఒంటి తెరచాప స్తంభం తెడ్ల నావ కూచి కొండల వార వెడుతోంది. చల్లగా వుండే ఉత్తర సముద్రపు తీరంలో వున్నాయి ఆ కొండలు. పొమోర్స్ అని పిలిచే రష్యా ప్రజలు అక్కడ జీవిస్తున్నారు. ఆ మగవాళ్లు వేటకి వెడుతున్నారు. ఒకతను నావ ముఖ భాగంలో నుంచున్నాడు. అతను జాగ్రత్తగా పరకాయించి జంతువులని చూడాలి. రెండోవాడు చుక్కానీ దగ్గర వున్నాడు. యిద్దరిదీ గద్ద చూపే.

‘‘ఒడ్డున వున్నవి యేమిటవి? వాల్రస్*ల్లా వున్నాయి?’’

అవును, నిజమే. ఎర్రగా వున్న భారీ జంతువులు రాళ్ల తీరం మీద చాచుకుని వున్నాయి. వాటికి మెడలు వున్నట్టే లేదు. ఒక జత పొడుగాటి దంతాలు, బిరుసు వెంట్రుకలు వున్న పై పెదవికింద నుంచి పొడుచుకువచ్చాయి. నావలోని వేటగాళ్లు వేటాడ్డానికి తయారయారు. ఒకడి దగ్గర గద వుంది, మరొకడి దగ్గర తాడు వుంది, మూడోవాడి దగ్గర గొడ్డలి వుంది. ఆ చిన్న కోచ్ నావ గుట్టుగా తీరం దగ్గరికి వెళ్లింది.

వున్నట్టుండి ఒక వెలిబూది మేఘం సముద్రాన్ని కమ్మేసింది. తెల్లటి యీగల దండులాగా తెల్లని పెద్ద మంచు తరకలు సుళ్లు తిరిగాయి, ఆకురాలుకాలాన్ని శీతాకాలంగా మారుస్తూ. మేఘం తేలి పోగానే, ఆ వాల్రస్‌లు మాయమైపోయాయి. మళ్లీ యింకో సారి ఆ చిన్న కోచ్ సముద్రంమీద బయల్దేరింది.



---

* సీల్ జాతికి చెందిన పొడుగాటి దంతాలున్న జంతువు. ఉత్తర ధ్రువ ప్రాంతంలో వుంటుంది. యిది ఉభయచరం, పిల్లలకి పాలు యిచ్చి పెంచుతుంది. అంటే సస్తన సముద్ర జంతువన్నమాట. — అను.

ఖైదీ ఓడలో తెడ్లువేసేవాడు

కొంతమంది సైనికులతో కొట్లాడినందుకు వెనిస్ బజారులో జియొవన్నీని నిర్బంధించారు. న్యాయాధికారి అతన్ని చెర ఓడకి పంపాడు. యిద్దరు యితర నేరస్థుల పక్కన అతన్ని బల్లకి సంకెళ్లతో కట్టేశారు. ఆ ముగ్గురూ పొడుగాటి ఒకే తెడ్డుని నడిపారు. భోజనం ఒకే కంచంలో తిన్నారు. పడకగా తలా సందెడు గడ్డి వుంది.

రేవునుంచి బయలుదేరిన ఒక వారం తర్వాత ఆ చెర ఓడ దళానికి శత్రు దుర్గం కనిపించింది. పోరాడే చెర ఓడలు అర్ధ వృత్తంగా యేర్పడి తీరం వేపు సాగాయి. దుర్గం గోడలనుంచి బాణాలు వానలా ఓడలమీద పడ్డాయి. ''గబగబా! గబగబా!'' అంటూ పర్యవేక్షకుడు అరిచాడు, కొరడాతో జియొవన్నీనీ, అతని తోటి వాళ్లనీ మోదుతూనే. వాళ్లు తమ శాయశక్తులా తెడ్డు వేస్తూనే వున్నారు. హఠాత్తుగా చెర ఓడ కంపించింది. పెళపెళమని పెద్ద చప్పుడు వచ్చింది. అన్ని వేపులా అరుపులు వినిపించాయి. ఆ ఓడ మెరక పట్టేసింది. మనుషులు, డాళ్లు, విరిగిన తెడ్లు పక్కలకి యెగిరిపోవడం జరిగింది. తమ బల్ల విరిగిపోయిందనీ, సంకెల చివర వదులైపోయిందనీ జియొవన్నీ చూశాడు. ఆ ముగ్గురు మనుషులూ సంకెలని తమ తలలపైగా యెత్తి, ఓడలోనుంచి బయటికి ఉరికేశారు.

ఆ రాత్రి వాళ్లు ఒక పాడుపడిన కమ్మరశాలలో తమ సంకెలని తెంపేసి, ఒకళ్లతో ఒకళ్లు కరచాలనం చేసుకుని విడిపోయారు. త్వరలోనే జియొవన్నీ స్వేచ్ఛాయుతుడుగా ఇటలీకి తిరిగివెళ్లాడు.



వెనిస్ తెడ్ల చెర ఓడ. తెరచాపని గాలి అనుకూలంగా వున్నప్పుడే వాడే వారు.



తెడ్లతో నడిపే అస్సీరియన్ పడవ.



ఈజిప్షియన్ ఒంటి తెరచాప తెడ్ల పడవ.



గ్రీకు యుద్ధనౌక.

గొప్ప ఆవిష్కరణల కాలం

ఓడలు ప్రయాణమై వెళ్లి, తిరిగి రెండు మూడు యేళ్ల దాకా తమ సొంత రేవులకి రాని రోజులు వుండేవి. కళాసీల కుటుంబాలు వాళ్ల కోసం బెంగపెట్టుకుని చూస్తూ వుండేవి.

ఎట్టకేలకి ఓడ తన సొంత తీరానికి తిరిగి వచ్చింది. ఆ దీర్ఘ యాత్రలో సిబ్బందిలో చాలామంది చనిపోయారు. తుఫానుల తాకిడికి ఓడ గురయింది, కాని కళాసీలకి యెన్ని కథలున్నాయని చెప్పుకోడానికి!

''మేము సముద్రంమీద ప్రయాణం చేసి అమెరికా వెళ్లాం. అక్కడున్న మనుషులకి రాగి రంగు చర్మం వుంది. తీరంమీద యిసక కంటే యెక్కువ వుంది వాళ్లదగ్గర బంగారం.''

స్పానిష్ కారవెల్
(తేలిగ్గా వుండి,
వేగంగా పోయే ఓడ).

యుద్ధనౌక (గాల్లియన్).



‘‘మేము ఇండియా వెళ్లాం. తెలుసుకదా, అక్కడ మనుషులు ఏనుగు అంబారీమీద వెడతారు! బజారులో బూరా వూత్తూ, పాముని ఆడించేవాడు కనిపిస్తాడు మీకు!’’

‘‘మేం ఆస్ట్రేలియా వెళ్లాం. అక్కడికి వెళ్లడానికి మాకు ఒక యేడాది పట్టింది. ఆ మైదానాల నిండా వింత జంతువులే. వూహించుకోండి, అవి లేగదూళ్లంత పెద్దవిగా వున్నాయి, కుందేళ్లల్లా గెంతుతాయి. వాటికి పేరు కూడా వుంది. వాటిని ‘కంగారూ’ అంటారు.’’

* * *

ప్రాచీన కాలపు ఓడలు భలే వుండేవి. ఒక రకం యుద్ధనౌక వెనకతట్టుమీద, చిన్న గోపురాలతోటీ, బాల్కనీలతోటీ, యిత్తడి లాంతర్లతోటీ ఒక ‘‘కోట’’ వుండేదనుకోండి. అది మరి నిజమే లెండి. యేమంటే, యింతా చేసి, ఓడేకదా నావికుడి యిల్లు. అంత గాడు ప్రయాణం అయి వెళ్లాడంటే యిక మరి యెన్ని నెలలో.

తొలి రష్యన్ ఓడలు

రష్యా జార్ పీటర్ ది గ్రేట్ (1672–1725) మామూలు పాలకుడు కాదు. ఓడల నిర్మాణం గురించి సర్వం తెలుసుకుందుకు ఆయన హాలండ్‌కి వెళ్లాడు. అందుకని చెప్పి ఆయన ఓడ వడ్రంగిగా కూలికి కుదిరాడు. ఒక రోజున రష్యన్ ఉన్నతవంశీకుల బృందం ఒకటి జార్‌ని చూడ్డానికి వచ్చింది. సగంసగం పూర్తయిన ఓడ చుక్కానీ కిందనుంచి ఒక వడ్రంగి పాక్కుంటూ వస్తూవుంటే, యిక చూడండి బాబూ వాళ్లకి కలిగిన ఆశ్చర్యం! ఆయన ఒళ్లంతా రంపం పొట్టూ, పీచు ముక్కలూ! ఆయన్ని చూడగానే వాళ్లంతా మోకరిల్లారు. డచ్ వాళ్లందరికీ తెగ నవ్వు తెప్పించిందది.... తర్వాత, ఆ ఓడని సముద్రంమీదకి పంపినప్పుడు, జార్ పీటర్ వెనకతట్టు కిందనుంచి గసికల్ని వూడగొట్టాడు.

జార్ పీటర్ స్వదేశం తిరిగివచ్చాక, యువ రష్యన్ ఉన్నత వంశీకుల్ని నౌకా యానం గురించి అధ్యయనం చేసేందుకు యూరప్ పంపాడు. క్రోన్‌ష్టాడ్ట్ అనిపిలిచే మొట్టమొదటి రష్యన్ ఓడ రేవు దుర్గాన్ని కోత్‌లిన్ ద్వీపంమీద నిర్మింపజేశాడు. మొట్టమొదటి రష్యన్ నౌకలు ఆ రేవునుంచి బాల్తిక్ సముద్రంమీద ప్రయాణం చేశాయి.



జార్ పీటర్ ది గ్రేట్ తొలి నావ.



1668లో నిర్మించిన ''ఒర్యోల్.''



రష్యన్ నావికులు యిలాంటి ఓడలమీద 250 యేళ్ల కితం ప్రయాణం చేశారు.

''పొల్తావా,'' రష్యన్ బాల్టిక్ నౌకా దళపు తొలి నౌక.

సం॥ 1712

యీ తెరచాప ఓడలో అంతా బాగుంది. అంతా శుభ్రంగా వుంది. తెల్లని చొక్కా వేసుకుని మాసిపోకుండా పడుకోవచ్చన్నంత శుభ్రంగా వుంది. యీ ఓడ యేమీ చప్పుడు చెయ్యకుండా వెడుతోంది. ఒక్క స్తంభాలు మాత్రమే కిర్రుకిర్రుమని చప్పుడు చేస్తున్నాయి. చాలా దూరదేశాలకి వెళ్లగలదు — గాలి బాగా వుంటే. తెరచాప ఓడకి యెన్ని రకరకాల తెరచాపలు వున్నాయో చూడండి.



1—4 – ముందటి స్తంభంమీద వుండే త్రిభుజాకారపు తెరచాపలు;

5—8 – ముందటి స్తంభంమీద వుండే చతుర్భుజ తెరచాపలు;

9—11 – ముఖ్యమైన ఎత్తు స్తంభపు త్రిభుజాకారపు తెరచాపలు;

12—15 – ముఖ్యమైన ఎత్తు స్తంభపు చతుర్భుజ తెరచాపలు;

16—19 – ఓడ వెనకభాగంలో కట్టే చతుర్భుజ తెరచాపలు.



నౌకా దళ సాయుధ నౌక అడ్డకోత. సామానులు వేసే గది, తుపాకీ అంచెలు, కేప్టెన్ గది ముందు భాగం.



యుగాలు గడిచిపోయాయి, ఆవిరి యంత్రాలు తెరచాపల స్థానంలో వచ్చాయి.

సం॥ 1807



రాబర్ట్ ఫుల్టన్ రూపొందించిన "క్లెర్‌మాంట్," మొట్టమొదటి ఆవిరి ఓడ.

సం॥ 1815



"ఎలిజవేతా" మొట్టమొదటి రష్యన్ ఆవిరి ఓడ.

సం॥ 1838



"ఆర్కిమెడీస్" ఆవిరి ఓడ. యిక్కడ చక్రం బదులు ప్రొపెల్లర్ వచ్చింది.

దురదృష్టపు "గ్రేట్ యీస్టర్న్"

1858లో జల ప్రవేశం చేసిన యీ ఓడని యీ యుగపు అద్భుతం అని పిలిచారు. యేమంటే అది అంత పెద్దది. కాని యింత పెద్దదీ నష్ట జాతకం పాలబడింది. తొలి ప్రయాణంలోనే దాని చుక్కానీ, తెడ్డు చక్రాలూ తుఫాన్‌లో కొట్టుకుపోయాయి. దాన్ని మరమ్మత్తు చేశారు, అయితేనేం, తర్వాతి ప్రయాణంలో అది ఒక కూచి కొండని ఢీకొంది. "గ్రేట్ యీస్టర్న్"మీద ప్రయాణం చెయ్యాలంటేనే జనం హడలెత్తిపోయేవాళ్లు.

ఆ పెద్ద ఓడ, దానికి వచ్చిన యే పనినైనా తీసుకోవాల్సివచ్చింది. అట్లాంటిక్ మహాసముద్రంమీదుగా టెలిగ్రాఫ్ తీగల్ని వేసింది. యుద్ధ కాలంలో అది సైన్యాల్ని కూడా తీసుకెళ్లింది, కొంతకాలంపాటు అది తేలియాడే సర్కస్‌లాగా వుంది.

చిట్టచివరకి "గ్రేట్ యీస్టర్న్"ని ఛిన్నాభిన్నం చేశారు. ఆ మహా ఉక్కు పర్వతాన్ని పూడగొట్టడానికి వందలాది రేవు పనివాళ్లకి రెండేళ్లు పట్టింది.

"గ్రేట్ యీస్టర్న్" పొడుగు 211మీ., వెడల్పు 25మీ. వుండేది. యిరవై లైఫ్‌బోట్లనీ, రెండు చిన్న ఆవిరి ఓడల్నీ మోసుకెళ్లేది యిది.



“త్వరలోనే తెరచాపల్లేని ఓడలు వస్తాయని వింటున్నాను.”
“అసంభవం. ఆవిరివల్ల ఓడలు నడవలేవు.”

అట్లాంటిక్‌ని దాటిన మొట్టమొదటి చుక్కానీ చక్రపు నౌక.







“వర్యాగ్” యుద్ధనౌక

1904లో రష్యా జపాన్ యుద్ధం వచ్చినప్పుడు ‘‘వర్యాగ్’’ అనే యుద్ధనౌక చెముల్పొ అనే కొరియా రేవులో లంగరు దింపింది. ఒక జపాన్ నౌకా దళం దీన్ని సమీపించింది. ‘‘వర్యాగ్’’ లొంగిపోవాలని జపాన్ నౌకా దళాధిపతి ఆదేశించాడు.

‘‘వర్యాగ్’’ కేప్టెన్ యుద్ధంలోకి దిగాలని నిర్ణయించాడు. ఆ యుద్ధనౌక రేవుని వదిలిపెట్టి సముద్రంమీద బయల్దేరింది.

‘‘లొంగిపో’’ అంటూ జపాన్ సూచన మళ్లీ వచ్చింది. ‘‘వర్యాగ్’’ యిచ్చిన జవాబు ఫిరంగి పేల్పు. జపాన్ రక్షణ నౌక పొగలు చిమ్మడం

మొదలుపెట్టింది. తర్వాత మళ్ళీ ఫిరంగి పేలి శత్రు నౌకని ముంచేసింది. కాని బలాబలాలు అసమంగా వున్నాయి. మిగిలిన జపాన్ నౌకల నుండి పేల్చిన గుళ్ళు "వర్యాగ్"మీద ధారాపాతంగా వచ్చిపడ్డాయి.

యుద్ధనౌక కేప్టెన్ దెబ్బతిన్న తన నౌకని ధారాదత్తం చెయ్య లేదు. దాన్ని ముంచెయ్యమని ఆదేశించాడు. జెండా యింకా యెగురుతూ వుండగానే అది నీటి అడుక్కి వెళ్ళిపోయింది.



"పీటర్ ది గ్రేట్" రష్యన్ యుద్ధనౌక.

ప్రపంచప్పు ఏకైక గుండ్రటి యుద్ధనౌక

19వ శతాబ్దంలో నోవ్‌గొరొద్ అనే గుండ్రటి యుద్ధనౌకని నమూనాచేసి, నిర్మించారు. యే దిక్కులో పడితే ఆ దిక్కులో అది పేల్చగలిగితే ఖాయంగా యే శత్రువునేనా ఓడించగలదని నమ్మారు.

కాని దాని తుపాకులు పేల్చడం మొదలుపెట్టగానే, నౌక గిరున తిరగడం మొదలుపెట్టింది.

"యిదిలా గిరికీలు కొట్టి తిరుగుతూ వుంటే యిక సరే గురిని కొట్టినట్టే" అన్నాడు దాని నిర్మాత. యుద్ధనౌక తుపాకీలని పేల్చడమే కాకుండా యింకా వేరేవీ చెయ్యాల్సి వుంటుందన్న విషయాన్ని అతను మర్చిపోయాడు. అది నిబ్బరంగా వుండగలగాలి.

సం॥ 1862



"మొనిటర్" చుట్టు తిరిగే ఫిరంగి గోపురం వున్న మొదటి కవచనిర్మిత యుద్ధనౌక.



"మ్యారిమాక్" "కవచం వున్న కమఠం" అని విదితమైంది.



"నోవ్‌గొరొద్," అడ్మిరల్ పొపోవ్ రూపొందించిన గుండ్రటి యుద్ధనౌక.

అంతర్ధానం

మోటారు నౌకమీద ప్రయాణీకుడొకడు తన పెంపుడు కోతిని తీసుకువచ్చి తన గదిలో పెట్టుకున్నాడు. యింతా చేసి, కొంచెం సేపట్లోనే అది మాయమైపోయిందని కనిపెట్టాడు. యెక్కడికి పోయి వుంటుంది అనుకుంటూ దాని కోసం వెదుకుతూ బయల్దేరాడు. కేప్టెన్ గది దగ్గర చూశాడు. అక్కడ చుక్కానీ పట్టేవాడిని చూశాడు, పటంమీద తమ ప్రయాణం గురించి పథకం వేసి నౌకని నడిపించే వాడిని చూశాడు. ఇంజను గదిలో చూశాడు, అక్కడ టర్బైన్లమీద డయల్స్‌ని పరిశీలించే మనుష్యుల్ని చూశాడు. ఓడ వంట గదిలో చూశాడు, వెయ్యి మంది ప్రయాణీకులకి భోజనం వండుతూ వున్న పదిమంది

ఆవిరి ఓడ టికెట్.

వంటవాళ్లని చూశాడు. కాని యెక్కడా అతనికి తన పెంపుడు జంతువు కనపడలేదు.

తర్వాత అతను లౌంజ్‌లో చూశాడు, యీత కొలను దగ్గర చూశాడు. తర్వాత డెక్కుమీద నడిచాడు. కోతి యెక్కడ పోయి వుంటుంది అతనికి గడబిడ అయిపోయి, తలనొప్పి వచ్చేసింది. ఆఖరికి, తలనొప్పి మందు కోసమని తన గదికి తిరిగివెళ్లాడు. అదుగో, తన సామాన్ల సంచీలో పెంపుడు జంతువు హాయిగా నిద్రపోతోంది.

''యిక్కడున్నావా! నీ కోసం తెగ వెతుకుతున్నాను. సరే, పోన్లే కనీసం ఓడని చూసే అవకాశం వచ్చింది. తేలిపోయే నగరంలా వుందిది'' అన్నాడతను.

"మరాత్" యుద్ధనౌక



యుద్ధనౌక "మరాత్."

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఒక జర్మన్ విమానం, లెనిన్‌గ్రాడ్ దగ్గర రేవులో ఆగిన రష్యన్ యుద్ధనౌక "మరాత్"మీద బాంబు వేసింది. నీళ్ల లోపలికి చొచ్చుకువచ్చి ఓడ ముందు భాగం మునిగిపోయింది. యిది జరిగింది శీతకట్టులో, లెనిన్‌గ్రాడ్ ముట్టడి అప్పుడు. నాజీలు బాంబులు వేసి, నగరంమీద గుళ్ళ కురిపిస్తున్నారు. లెనిన్‌గ్రాడ్‌ని దిగ్బంధం చేశారు. రక్షకులకి శత్రువుని తరిమేసేటందుకు తగ్గ తుపాకీలు లేవు.

అప్పుడు పనివాళ్లు రాళ్ల రేవు దగ్గరికి వచ్చారు. గంట్లు పడిన ముందు భాగాన్ని విడదీసి, ఓడలో చీలిన భాగాల్ని అతికి, తుపాకీ గోపురాల మోటార్లని మరమ్మత్తు చేశారు. ఆ పాత యుద్ధనౌకకి మళ్లీ జీవం వచ్చింది. ఖంగుమంటూ ఆజ్ఞలు వచ్చాయి, నావికులు తుపాకీలని పట్టారు. తుపాకీ గొట్టాలు పైకి లేచాయి. ఆ రోజునుంచీ "మరాత్" తుపాకీలు శత్రువు కాల్పులకి బదులు చెప్పాయి. దెబ్బ తిన్న నౌక మళ్లీ రంగంలో దూకింది.

* * *



మిస్సైల్లని ప్రయోగించే యుద్ధనౌక.

మిస్సైల్లని ప్రయోగించే ఓడ కంచుకోట లాంటిదే. కాని యివాళ అన్నిటికంటే అత్యంత శక్తివంతమైన నౌక అణుశక్తి జలాంతర్గామి, యేమంటే అది రాకెట్లతోటి కూడా సాయుధమై వుంటుంది. అది పైకి తేలే దాకా, యెక్కడ వుండిందో యెవ్వరికీ తెలీదు.



పరమాణు శక్తి చోదిత జలాంతర్గామి.


601
562

ఏనుగుల రవాణా

ఒక జూ డైరెక్టరుగారు కొన్ని ఏనుగులని సముద్రం అవతల వేరే జూకి ఓడలో పంపాల్సివచ్చింది. కాని వాటి ప్రయాణానికి ఓడ టిక్కెట్లు దొరకడం ఆయనకి కష్టం అయింది.

''నేను ఓడమీద ఏనుగుల్ని తీసుకెళ్లలేనండోయ్, యీ కలప చెక్కలూ, దుంగలూ వున్న చోట వాటి బోనుల్ని పెట్టలేను'' అన్నాడు కలప రవాణా ఓడ కేప్టెన్.

''అబ్బెబ్బె, కుదరదు, మీ ఏనుగులు లోపల బిగిసిపోయి చస్తాయి'' అన్నాడు రిఫ్రిజిరేటెడ్ చేసిన సరుకు రవాణా ఓడ కేప్టెన్.

''వుహు, వీల్లేదు. లోపలంతా చమురు విండుగా వుంది'' అన్నాడు ఆయిల్ టాంకరు కేప్టెన్.

ఎట్టకేలకి, పొడి సరుకులు రవాణా చేసే ఓడ కేప్టెన్ అన్నాడు, ''ఏనుగులా, తప్పకుండానూ. ఎన్నింటిని మీరు ఓడమీద పంపాలంటే అన్నింటినీ. ఆ బోనుల్ని ట్రాక్టర్ల మధ్యలో పెట్టి మీ సరుకుని చెక్కు చెదరకుండా అప్పగిస్తాం.''

ఆ రకంగా ఏనుగులు సముద్రాన్ని దాటాయి.



పొడి సరుకు రవాణా ఓడ.



ఆయిల్ టాంకర్.



రిఫ్రిజిరేటెడ్ రవాణా ఓడ.





పొడి సరుకు రవాణా ఓడ అడ్డ కోత. సరుకుల జాగా, డెక్కు, తెర చాప కొయ్య, క్రేన్లు చూపించడం జరిగింది.

"క్రాసిన్"

1928లో ఉత్తర ధృవాన్ని దాటాలని ఉంబేర్తొ నోబిలె నాయకత్వాన పరిశోధక బృందం ఇటలీనుంచి చోదనీయ గుమ్మటంమీద బయల్దేరింది. ధృవాన్ని దాటగలిగారు గాని చోదనీయ గుమ్మటంమీద మంచు మేటకట్టి, అది కూలిపోయింది. అందులోని మనుషులు మంచులో చిక్కుకుపోయారు.

సహాయం కోసమని వాళ్ళు చేసిన ఆర్తనాదాలని సోవియట్ హిమ విచ్ఛేదక నౌక "క్రాసిన్" వింది. పరిశోధక బృందంలోని చాలామంది సభ్యులు జబ్బుగా వున్నారు లేదా గాయపడ్డారు. వాళ్ల దగ్గర తిండి సరుకులు నిండుకుంటూ వున్నాయి. వాళ్ల గుడారం కింద మంచు బీటలు తీయడం మొదలుపెట్టింది.

యీలోపున "క్రాసిన్" హిమ సముద్రంమీదుగా వాళ్ల దగ్గరికి వెడుతోంది. ఒక హిమ పర్వతం గనక దారి యివ్వకపోతే "క్రాసిన్" దూసుకుపోయి, ముందు భాగంతో ఢీకొట్టేది.

ఆఖరికి, ఆ చిక్కుపడిన ఇటలీ వాళ్లకి దిఙ్మండలంమీద పొగ కనిపించింది, తర్వాత తెరచాప స్తంభంమీద ఎగురుతూ వున్న ఎర్ర జెండా కనిపించింది. అది "క్రాసిన్." వాళ్లని ఓడమీద ఎక్కించు





ఆవిరి ఓడ ‘‘లీత్కే,’’ హిమవిచ్ఛేదకం.

కుంటూ వుంటే సంతోషంతో యేడ్చారు. చివరకి వాళ్ళు తమ గుడారాన్ని పైకి యెత్తారు. అది కూడా ఎర్రని ఎరుపుతో వుండి, దూరానికి కనిపించింది.

* * *

‘‘యివాళ ప్రపంచంలో ఏ హిమవిచ్ఛేదక నౌక అతి పెద్దది?’’
‘‘ ‘లియొనీద్ బ్రేజ్నెవ్’ అనే పేరున్న సోవియట్ నౌక.’’
‘‘ప్రపంచపు అతిపెద్ద పరమాణు శక్తిచోదిత నౌక యేది?’’
‘‘అదే.’’



పరమాణు శక్తి చోదిత ‘‘లియొనీద్ బ్రేజ్నెవ్’’ సోవియట్ హిమవిచ్ఛేదక నౌకల అగ్రగామి నౌక.

‘‘యీ రోజుల్లో సముద్రాలమీద ఎన్నో వింత నౌకలు ప్రయాణం చేస్తూ వున్నాయి. ఓడలు పూర్వం వుండినట్టుగా అవి వుండనే వుండవు. డెక్కుమీద పెద్ద పళ్లెంలు వున్నది ఒకటుంది.’’

‘‘అది రాడార్. భ్రమణంలో వున్న రోదసీ యాత్రీకులకి, నిరంతరం వాళ్లతో సంబంధాలు పెట్టుకుని, అది సహకరిస్తుంది.’’

‘‘డెక్కుమీద క్రేన్ వున్న ఓడ ఒకటుంది, బాథీస్ఫియర్ (సముద్ర గర్భ పరిశోధనకి వాడే పెద్ద గోళం) జలాంతర్గామిలాగా వుంది కూడా.’’

‘‘సముద్రంలో లోతుకంటా పోయేవాళ్లకి సాయపడుతుంది, అది సముద్రపు మట్టుని పరీక్షిస్తుంది. దాని బాథీస్ఫియర్ సముద్రపు అడుక్కంటా నేల దాకా పోగలదు.’’

‘‘యిక తర్వాత దేన్ని తయారుచేస్తారో?’’


‘‘పెర్సియస్’’ మొదటి సోవియట్ పరిశోధక నౌక.



С. Сахарнов
ПЛЫВУТ ПО МОРЯМ КОРАБЛИ
На языке телугу

S. Sakharnov
SHIPS GO SAILING ON THE SEAS
In Telugu

© తెలుగు అనువాదం ''రాదుగ'' ప్రచురణాలయం 1985
© మాస్కో «Детская литература» 1976

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ISBN 5-05-000343-1